# సూదిగట్టు

ఆ కాలేజీలో చేరడమే నేను జీవితంలో చేసిన పెద్ద పొరపాటు అని ఇప్పటికీ అనుకుంటూ ఉంటాను. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడే మనస్తత్వం కాదు నాది. ముఖ్యంగా విద్యార్థినులతో మాట్లాడడం నాకు చాతకాదు. అటువంటి నన్ను అటునుండి ఇటు లాగిన వ్యక్తి విద్యావతి, ఆమె పి.యు.సిలో కూడా నా క్లాస్‌మేట్. అంత అందమయిన వ్యక్తిత్వం కాదు. ఆకర్షణీయంగానూ ఉండేది కాదు. యవ్వనస్తురాలు కాబట్టి, నిండుగా ఉండేది. ఏ లైబ్రరీలోనో, కేంటిన్‌లోనో, ఏ గెట్ టుగెదర్‌లోనో నేనో మూల ఒంటరిగా కూర్చుంటే నా దగ్గరకు వచ్చి ఖాళీ కుర్చీని నా కుర్చీకి దగ్గరగా లాక్కుని, కూర్చుని 'తప్పించుకుందామనే' అనేది. ఆమె నవ్వు బావుండేది. మాటలు బావుండేవి.. నాతో తనే ఎక్కువ మాట్లాడేది. నేను మాట్లాడానికి అట్టే అవకాశం ఇచ్చేదికాదు. నా గురించి మొదట్లో ఆమెకేం తెలియదు. నన్ను అడగలేదు. నేను చెప్పలేదు. నిజానికి నా గురించి చెప్పుకోడానికి ఏమీలేదు. సామాన్యుడికి ఒక మెట్టు కిందే ఉన్న వాడిని. మా ఇంట్లో నాకు ముందు ఎవరూ కాలేజీలో చదవలేదు.

విద్యావతి నాతో మాట్లాడడం ఇష్టంగా ఉండేది. ఆమె నాతో అయిదు నిమిషాలు మాట్లాడినా, పదినిమిషాలు, గంట మాట్లాడినంత సంతోషంగా ఉండేది. మేమిద్దరం స్నేహితులమని కొంతమంది అనుకునేవాళ్ళు. నిజానికి కాదు. కాలేజీ జీవితం అటువంటిది.

ఒక్కో క్లాసు నలభయి అయిదు నిమిషాలుండేది. క్లాసు క్లాసుకు గదులు మారుతూ ఉండే వాళ్లం. క్లాసులో విద్యార్థులు ఒక పక్క, విద్యార్థినిలు ఒక పక్క కూర్చునేవాళ్ళం. క్లాసులో పాఠం నడుస్తున్నప్పుడు విద్యార్థినులు కూర్చున్న వయిపు ఎప్పుడయినా చూస్తే విద్యావతి నా వంకే చూస్తూ ఉండేది. పెదాలు దాటీ దాటకుండా చిరునవ్వు కదిలేది. నా గుండె కొట్టుకోవడం నాకు వినిపించేలా చప్పుడవుతోంటే వెంటనే చూపులు మరల్చుకునేవాడిని. మనసును అదుపులో తెచ్చుకోడానికి సమయం పట్టేది.

విద్యావతి మా వైస్ ప్రిన్సిపాల్ కూతురు. మా ప్రిన్సిపాల్‌ను చాలామంది అంతగా పట్టించుకునేవారు కాదు కాని మా వైస్ ప్రిన్సిపాల్‌కు అందరూ భయపడేవారు.

బి.పి.కరుణాకర్

ఆయన పేరు నరసింహం. పేరుకు తగ్గ మనిషి. ప్రిన్సిపాల్‌కు ఎక్కువ సర్వీసులేదు. ఆయన పదవీ విరమణ కాగానే నరసింహం ప్రిన్సిపాల్ అవుతాడనుకునేవాళ్ళం.

డిగ్రీ మొదటి సంవత్సరంలా రెండో సంవత్సరంలో కూడా ప్రతి సబ్జెక్టులో తొంబయి ఆరుశాతం పయిగా మార్కులు వచ్చేసరికి నేను అందరి దృష్టిలో పడ్డాను. ఆ సందర్భంలో నరసింహం నన్ను తన గదిలోకి పిలిచి అభినందిస్తున్నందుకు కాదు గాని ఆయన గదిలో విద్యావతి ఉన్నందుకు సంతోషం వేసింది. తండ్రిలా విద్యావతి నన్ను అభినందిస్తుందనుకున్నాను. లేదు. ఆమె కిటికీ పక్కనే నిలబడి బయటకు చూస్తోంది.

"కూర్చో" అన్నాడు.

ఆయనకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను. ఆ గదిలోకి అడుగు పెట్టడం నాకు అదే మొదటిసారి. కూర్చోగానే బంట్రోతు కాఫీ తెచ్చి బల్లమీద నా ముందుంచాడు.

"తీసుకో" అన్నాడు.

"మీరు?"

"నువ్వు వచ్చే ముందే మేమిద్దరం తీసుకున్నాం".

కాఫీ తాగుతోంటే నా గురించి ఒక్కొక్కటి అడగడం మొదలెట్టాడు.

"పి.యు.సిలో మార్కులు ఎలా వచ్చాయి?" అడిగాడు.

చెప్పాను.

"గుడ్‌గాడ్. అంత మంచి మార్కులు తెచ్చుకుని బి.యస్.సి.లో ఎందుకు చేరావు? ఏ ప్రొఫెషనల్ కాలేజీలోనో కళ్ళ కద్దుకుని తీసుకునేవాళ్లు కదా?"

అప్పట్లో ఎంసెట్‌లు తదితర పరీక్షలు ఉండేవి కావు. పి.యు.సి మార్కులతోనే ప్రొఫెషనల్ కాలేజీల్లో సీట్లు ఇస్తుండేవారు. అన్నీ ప్రభుత్వ కాలేజీలే అయి ఉండేవి.

"డబ్బు లేక చేరలేదండి".

"మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చేది కదా?"

"ముందు చేరడానికి ...." అంటోంటే నా మాటలకు అడ్డుతగిలి, "యు డిడ్ ఎ బ్లండర్. మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?"

"లేరండీ. చనిపోయారు. అమ్మ కూడా లేరు."

"ఎవరు చదివిస్తున్నారు?"

"మా అన్నయ్య".

"అతనేం చేస్తుంటాడు?".

"అన్నయ్యకు చిన బజారులో చెప్పుల దుకాణం ఉంది. అంత పెద్దదేమీ కాదు."

తర్వాత, అతను నా గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపించలేదు. నేను ఉన్నవాడినని ఊహించి ఉండాలి. నా మాటలు అతన్ని నిరుత్సాహ పరిచి ఉంటాయి. నా గురించి నేను చెప్పుకోడానికి ఎప్పుడూ సిగ్గుపడను. సెలవురోజుల్లో, కాలేజీ అయిపోయిన వెంటనే అన్నయ్య దుకాణానికి వెళ్ళి సహాయం చేయడమో అక్కడే అన్నయ్య పిల్లలిద్దరినీ కూర్చోబెట్టి పాఠాలు చెబుతుండడమో చేసేవాడిని.

నేను కాఫీ తాగడం పూర్తి చేయలేదు. "ఇహ నువ్వు వెళ్ళొచ్చు" అన్నాడు.

నమస్కారం చేసి బయటకు వచ్చాను.

ఆ రోజు నుంచి విద్యావతి నాతో మాట్లాడక పోవడం అటుంచి నా వంక చూడడం మానేసింది. వారం, పదిరోజులపాటు బాధ వేసింది. ఒకటీ రెండు రాత్రులయితే నిద్రపట్టలేదు. కళ్ళు తెరిచి చీకట్లోకి చూస్తూ ఉండిపోయాను.

మెల్లగా ఆ భ్రమలోంచి బయట పడ్డాక నేను చేసిన మొదటిపని క్లాసులో నేను కూర్చున్న స్థలం మార్చడం. చివరి బెంచీకి వచ్చేశాను. ధ్యాస తిరిగి చదువుమీద మళ్ళించి నేను మొదటిలాగా అవుతున్న సమయంలో రాధతో పరిచయం అయింది. మనిషి చాలా బావుండేది. ఆమెను 'కాలేజీబ్యూటీ' అనేవాళ్ళు. ఆమె ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడం నేను గమనించలేదు. రిజర్వ్‌డ్‌గా ఉండేది. కేంటీన్‌కు ఒక్కతే వెళ్ళేది. ఒక మూల కూర్చుని కాఫీ తెప్పించుకుని, తాగి వచ్చేసేది. నలుగురయిదుగురు లెక్చరర్లు ఆమెతో సన్నిహితంగా ఉండడానికి ప్రయత్నించారు. కాని ఆమె ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. ఆమె స్వభావమే అంత అని ఆమెతో పరిచయమయ్యాక గాని తెలియలేదు.

నేను చివరి బెంచీల్లో కూర్చోవడం మొదలెట్టిన దగ్గరనుండి అట్టే డిస్టర్బెన్స్ ఉండేది కాదు. లైబ్రరీ నుండి తెచ్చుకున్న పుస్తకాల నుండి నోట్సు తయారుచేసుకునేవాడిని. ఎయిడెడ్ కళాశాల అవటాన కెమిస్ట్రీ లెక్చరర్లు బయట ట్యూషన్లమీద చూపించే శ్రద్ధ కాలేజీ క్లాసుల్లో పాఠాలు చెప్పడానికి చూపించేవాళ్ళు కాదు. నాకు ఆర్గనిక్ కెమిస్ట్రీ అంటే ఎంతో ఇష్టం. ఒక మధ్యాహ్నం మా క్లాసుకు లెక్చరరు రావడం ఆలస్యమయ్యేసరికి రాధ నేను కూర్చున్న చోటుకు వచ్చి, "నేనిక్కడ కూర్చోడం మీకేమయినా అభ్యంతరమా?" అడిగింది.

"లేదు. నాకెటువంటి అభ్యంతరం లేదు" అంటోంటే నా గొంతులో తడారి పోయింది. అది బొత్తిగా ఊహించని విషయం అవటాన ఆమె కళ్ళల్లోకి చూస్తూ తల అడ్డంగా ఆడించాను. 'లేదు' అని అన్నానో లేదో గుర్తులేదు. రాధ వచ్చి నా పక్కన కూర్చోవడం నాకు నమ్మశక్యంగా అనిపించలేదు. అందరూ మా వంకే చూడసాగారు. క్లాసు నిశ్శబ్దమయింది. రాధ నాకు మరింత దగ్గరగా కూర్చుని, "మీరు దయచేసి ఎవరితోనూ అనకండి. నాకు ఆర్గనిక్ కెమిస్ట్రీలో కొన్నింటి, బోలెడు డౌట్సు ఉన్నాయి.. మీరు సహాయం చేయగలరా?" చిన్నగా అడిగింది, ఆ మాటలు నాకు మటుకు వినిపించేలా.

"చేస్తాను." నా గొంతు నాకే కొత్తగా వినిపించింది.

"మిమ్మల్ని నేను ఇబ్బంది పెట్టడం లేదుకదా?"

"లేదు".

తన డౌట్స్ పది నిమిషాలపాటు చెబుతూ వెళ్ళింది. చివర్లో అంది, "నవ్వొద్దు; రెండో సంవత్సరపు బేక్‌లాగ్‌లు ఉన్నాయి. సెప్టెంబరు దగ్గర పడుతోంది.. పూర్తి చేయలేమోనని భయంగా ఉంది..."

"నా మీద నమ్మకం ఉంచండి. సెప్టెంబరు పరీక్షల్లో బేక్‌లాగ్‌లన్నీ క్లియర్ అయ్యేలా మీకు సహాయం చేస్తాను" అని విద్యావతి కూర్చున్న వయిపు చూశాను. విద్యావతి మా వంక తీక్షణంగా చూస్తోంటే నాకు పట్టరాని ఆనందం కలిగింది.

రాధ తెలివి గల వ్యక్తి. ఆమెను సెప్టెంబరు పరీక్షలకు సిద్ధం చేయడానికి నేను పెద్దగా కష్టపడలేదు. అతి త్వరలోనే ఫార్ములాలన్నీ చేతివేళ్ళ మీదకు తెచ్చుకుంది.ఏ ప్రశ్నకయినా జవాబు రాయగలిగే స్థితికి వచ్చేసింది. చదువు మీద శ్రద్ధ పెరిగింది. నేనే తనకు దూరమవ్వడానికే సిద్ధపడ్డాను. ఆమెతో ఏ విషయం లోనూ సరితూగలేను. ఆమె లేడీస్ హాస్టల్‌లో ఉంటున్న సంగతి తప్ప నాకు ఆమె గురించి ఏమీ తెలియదు. తెలుసుకోవాలని కూడా అనిపించలేదు. తనకు నా గురించి తెలుసేమో నాకు తెలియదు. మా ఇద్దరి సాన్నిహిత్యం చదువుకు మించలేదు. రెండు మూడు రోజులకొకసారయినా గంటా గంటన్నర పాటు కేంటీన్‌లోనో, లైబ్రరీలోనో కూర్చున్నప్పుడు తనే చాలా జోకులు చెప్పేది. ఆమెకు అన్ని తెలుసని నాకు తెలియదు.

సెప్టెంబరు పరీక్షలు నాలుగయిదు రోజుల్లో మొదలవుతాయనగా కాలేజీ లోపలి గోడల మీద, కేంటీన్ బయట గోడలమీద, నోటీసు బోర్డుల దగ్గర, 'విద్యావతి, మెహబూబ్‌ఖాన్ ప్రేమ కలాపాలు- రమాకాంత్! అని రాసి ఉన్న చిన్న పోస్టర్లు

అతికించబడి ఉన్నాయి. నా పేరు రమాకాంత్. నాకూ ఆ పోస్టర్లు రాసి అతికించడానికి ఎటువంటి సంబంధం లేదు. నేను రాయలేదు. రాయించలేదు. గోడలకు అతికించలేదు. రాయించాల్సిన అవసరం లేదు. అంత హంగులేదు. విద్యావతి, మెహబూబ్‌ఖాన్ స్నేహితులన్న సంగతి నాకు తెలియదు. ఒకరి విషయాల్లో జోక్యం చేసుకునే వ్యక్తిని కాను. నేనంటే గిట్టనివాళ్ళు ఎవరో చేసి నా పేరు పెట్టారు. ఆ సంవత్సరం మంచి మార్కులు తెచ్చుకుని పోస్టు గ్రాడ్యుయేషన్ చేసుకుంటూ సివిల్స్ వెళ్ళే ఆలోచనల్లో ఉన్నాను. అంతకు తప్ప వేరే కోరిక లేదు. మెహబూబ్ ఖాన్‌తో నాకు పరిచయం ఉంది. మా కాలేజీ స్టూడెంట్స్ యూనియన్‌కు జనరల్ సెక్రటరీ. అతని తండ్రి హోల్‌సేల్ పండ్ల వర్తకుడు. మా కాలేజీలో చాలామంది ఖాన్ అంటే భయపడేవాళ్ళు. నాతో అప్పటివరకు బాగానే ఉన్నాడు. ఆ వేళ గొడవేమయినా అవుతుందేమోనని అనిపించింది. నాకు ఎటువంటి సహాయం అందుతుందని అనుకోవడం లేదు. నేనంటే ఖాన్‌కు గౌరవం ఉంది. ఆ సంఘటనపయి అతను ఎలా రియాక్ట్ అవుతాడో ఊహించలేకపోతున్నాను. ఏదయినా జరిగితే నా పరిస్థితి ఆలోచించడానికి భయంవేస్తోంది. క్లాసుకు వెళ్ళబుద్ధి కాలేదు. మనసు వికల మయింది.

ప్రిన్సిపాల్‌తో మాట్లాడదామని ఆయన గదివయిపు వెళ్తోంటే నన్ను ఎరిగిన వాళ్ళు నన్ను చూసి ముఖం చాటేయడం మొదలెట్టారు. ఎవరూ నన్ను పలకరించలేదు. నాకే నేను కొత్తగా అనిపించసాగాను. ప్రిన్సిపాల్ గదిలోకి నడవబోతోంటే బంట్రోతు చేయి అడ్డం పెట్టి, "అయ్యగారు బిజీగా అన్నారు.. " అంటున్నాడు. వినిపించుకోలేదు. అతని చేతిని నెట్టి గదిలోకి నడిచాను. నాలో నేను లేను.

ప్రిన్సిపాల్ ఎవరితోనో ఫోనులో మాట్లాడుతూ నన్ను చూసి రెండో చేత్తో కూర్చోమన్నట్లు సైగ చేసాడు. ఆ కాలేజీలో చేరినప్పుడు మొదటిసారిగా ఆ గదిలోకి వచ్చాను. అది రెండోసారి, కూర్చున్నాను. భయంగా ఉంది. పంకా గాలి చల్లగా తగులుతోంది.

నిమిషం తర్వాత ఫోను పెట్టేసి నా ముఖంలోకి చూసి బల్లమీదున్న పేపరు వెయిట్‌ను చిన్నగా తిప్పుతూ, ఎంతోమంది విద్యార్థులతో నన్ను ఎలా గుర్తుపట్టాడో, ఏమో, "నీ కోసమే కబురు చేద్దామనుకుంటుండగా నువ్వే వచ్చావు...వెల్.. పోస్టర్లు చూసి ఉంటావు..." నెమ్మదిగా అన్నాడు. మాటల్లో కోపం లేదు. ఎప్పుడోగాని ఎవరి మీదయినా కోపంతో విరుచుకు పడడని విన్నాను.

తలూపాను.

"నీకూ, వాళ్ళకు పడదా? ఎప్పుడయినా పోట్లాడుకున్నారా?"

"అదేం లేదండీ. మేము ఎప్పుడూ పోట్లాడుకోలేదు. నేను వాళ్లతో బావుంటాను. వాళ్ళూ నాతో బావుంటారు. నేను అందరితో మంచిగా ఉంటానండీ.. మా క్లాసు వాళ్లను ఎవరినయినా అడగండి..." అంటున్నాను. ఆయన నా మాటలు వింటున్నట్టు అనిపించలేదు.

"వాళ్ళిద్దరి మధ్యా స్నేహం నిజంగా ఉందా?"

"నాకు తెలియదండీ."

"నువ్వూ, విద్యావతి మాట్లాడుకోరట..."

"లోగడ మాట్లాడుకునేవాళ్ళం..." ఆగి, "ఆమే నాతో మాట్లాడడం మానేసిందండి" అన్నాను.

"విద్యావతి నీతో మాట్లాడనంత మాత్రాన బ్రిలియంట్ స్టూడెంటువయిన నీకు ఇలాంటి వెధవ పని చేయబుద్ధి వేసింది? మీరు కాలేజీకి ఎందుకు వస్తుంటారయ్యా?"

"ఆ పోస్టర్లు నేను వేయలేదండీ..."

"ఎవరో వేసి కింద నీ పేరు పెట్టి ఉంటారు. అవునా?"

"అవునండీ."

నిమిషం పాటు మవునంగా ఉండి, "పోనీ, ఈ మాట చెప్పు. నీకు ఎవరి మీదయినా అనుమానం ఉందా?" అడిగాడు.

"లేదండీ."

"నీ పేరు నువ్వే పెట్టుకుంటే ఆ పని నువ్వు చేయలేదని బుకాయించవచ్చు కదా?"

ఆయన ఒక నిర్ణయానికి వచ్చాడు. ఏం చెప్పాలో నాకూ తెలియలేదు.

పేపరు వెయిట్ తిప్పడం ఆపి, నాలుగయిదు కాయితాలు నా ముందుకు విసురుగా పెట్టి, "నువ్వు వెళ్ళొచ్చు" అన్నాడు కోపంగా.

లేచి నుంచుని కాయితాలు అందుకుంటుంటే, "నిన్ను పోలీసులకు అప్పగించమని మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు రికమెండ్ చేశారు. ఆ పని చేయాలనిపించలేదు. నిన్ను కాలేజీ నుండి తీసేస్తున్నాను" అన్నాడు.

గదిలోంచి బయటకు వచ్చాను. ఇటువంటిదేదో జరుగుతుందని అనిపించింది. నా చదువు ఆగిపోయింది. అన్నయ్య ఏమంటాడో తెలియదు. నాకన్నా ఎక్కువ

బాధపడతాడు. నన్ను నేను కూడగట్టుకోడానికి సమయం పడుతుంది. కాలేజీ ముఖద్వారం వయిపు నడుస్తోంటే నలుగరయిదుగురు పనివాళ్ళు గోడలకు అతికించబడి ఉన్న పోస్టర్లను తీసివేస్తూ కనిపించారు.

ఇది జరిగి ఇరవయి రెండు సంవత్సరాలు గడిచాయి. కాలం గాయాలను మాన్పుతుందనే మాట నా విషయంలో వర్తించలేదు. నేను చేయని తప్పుకు నేను శిక్షించబడ్డాననే విషయం గుర్తురాని రోజు లేదు. ఆ బాధ అలా గూడు కట్టుకుపోయింది.

గత అయిదు సంవత్సరాలలో ఒకటీ రెండుసార్లు ఆ ఊరు ఏదో పనిమీద వచ్చినప్పుడు ఆ కాలేజీ ఎదుటనుండే వెళ్ళాను. వెళ్ళేప్పుడు తెలిసిన వాళ్ళెవరయినా కనిపిస్తారేమోనని అనుకునేవాడిని. కొత్త ముఖాలు మటుకు కనిపించేవి. లోపలికి వెళ్దామనే ఉండేది. వద్దనీ ఉండేది. ఒహవేళ వెళ్ళి ఉంటే నాకు తెలిసిన వాళ్లెవరయినా కనిపించి ఉండేవారు. ఆ కాలేజీలో చదువుకున్నానని మాటవరసకయినా నేను ఎవరితోనూ అనలేదు.

ఆ తర్వాత ఆఫీసు పనిమీద వెళ్ళినప్పుడు నాపని ముగించుకుని రాత్రి తొమ్మిది గంటల సమయంలో తిరిగి వచ్చేస్తున్న సమయంలో ఆ కాలేజీ ఆవరణ దేదీప్యమానంగా వెలుగుతుండడం గమనించి కారు నెమ్మది చేయించి చూశాను. ముఖద్వారానికి 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం' అని రాసి ఉన్న బేనరు చూశాక కాలేజీలోకి వెళ్దామనిపించింది. కారు ఆపించాను.

సెక్యూరిటీగా ఉన్న వెనక కారు కూడా ఆగింది. ఇనస్పెక్టరు కారు దిగి పరుగెత్తుకుంటూ వచ్చాడు. తలుపు తెరుచుకుని కారు దిగుతూ, "ఒకప్పుడు ఈ కాలేజీలో చదువుకున్నాను. లోపలికి వెళ్ళి నాతో చదువుకున్న వాళ్లనుపలకరించి పావుగంటలో తిరిగి వచ్చేస్తాను" అన్నాను.

"పదింటికల్లా మీరు ఎయిర్‌పోర్టులో ఉండాలి" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

నవ్వి గుర్తుందన్నట్లు తలూపాను.

లోపలికి నడుస్తోంటే, "మీ కూడా వచ్చేదా?" అడిగాడు.

నా బాధ్యత అతనిది, జరగకూడనిది జరిగితే అతని పీక మీద కొస్తుంది.

"సరే, రా" అన్నాను.

స్టేజి, స్టేజిముందున్న ఖాళీస్థలమంతా రంగు రంగుల దీపాలతో అలంకరించబడి ఉన్నాయి. షామియానా కిందంతా జనం ఉన్నారు. భోజనాలు మొదలయినట్టున్నాయి.

డయాస్ మీద ఎవరూ లేరు. కొద్దో గొప్పో తెలిసి ఉన్న ముఖం కనబడుతుందేమోనని చూడడం మొదలుపెట్టాను. చాలామటుకు కొత్త ముఖాలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడా తెలిసినట్టున్న ముఖాలే కనబడుతున్నాయి కాని ఎవరెవరో గుర్తు రావడం లేదు. ఒక లావుపాటి మనిషి బూడిదరంగు సూటులో ఉండి అటూ ఇటూ తిరుగుతూ అందరినీ పలకరిస్తున్నాడు.

అట్టే కష్టపడకుండా విద్యావతిని పట్టుకోగలిగాను. ఆమె అంతగా మారినట్టు నాకు అనిపించలేదు. మనిషి కొద్దిగా లావెక్కింది.ఆమె ఎవరితోనో మాట్లాడుతోంటే, చొరవ తీసుకొని, "క్షమించండి... రెండంటే రెండు నిమిషాలు మీతో మాట్లాడవచ్చా?" ప్రాధేయపూర్వకంగా అడిగాను.

ముందు నన్నెవరో అనుకుని నా వంక విసుగ్గా చూసి వెంటనే గుర్తు పట్టిందనుకుంటాను, "నువ్వు.. నువ్వు... మీరు రమాకాంత్ కదూ?" అని ఎంతో సంతోషంగా నా చేయి పట్టుకుని స్టేజి పక్కకు తీసుకొచ్చి, "మళ్ళీ మిమ్మల్ని చూస్తానని, మైగాడ్, నేను అసలు అనుకోలేదు... ఆశ్చర్యంగా ఉంది.. అంతకు మించి ఆనందంగా ఉంది... నిజం చెప్పేదా. ఎగురుతూ గంతులేద్దామని ఉంది.. మీరేం మారలేదు. కాకపోతే జుట్టు అక్కడక్కడా తెల్లబడింది. మీరిప్పుడు ఎక్కడ ఉంటున్నారు. ఏం చేస్తున్నారు? నేనిప్పుడు ఈ కాలేజీ ప్రిన్సిపాల్‌ను. ..." అప్పటిలా ఆమె మాటలు ఆగడం లేదు. నన్ను మాట్లాడనీయడం లేదు. నాకు అట్టే సమయం లేదు.

ఆమె మాటలు ఆపిన వెంటనే, "పది నిమిషాల వరకు ఇక్కడకు వద్దామని అనుకోలేదు. మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకూ ఎంతో సంతోషంగా ఉంది. అన్నిటికన్నా ముందు మిమ్మల్ని మిలియన్ డాలర్ల ప్రశ్న అడగాలని ఉంది... " అంటున్నాను. నా మాటలకు అడ్డు తగులుతూ, "ప్రస్తుతం మీరేం చేస్తున్నారు?" అడిగింది.

"నా వివరాలన్నీ చెబుతాను. ఈ నా ప్రశ్న నన్ను ఎప్పటినుంచో హంట్ చేస్తోంది. అప్పటి పోస్టర్లు మీకు గుర్తుండే ఉండాలి. వాటిని తయారు చేయడానికి, గోడల మీద అతికించడానికీ, నాకు ఎటువంటి సంబంధం లేదు. ట్రస్ట్‌మీ, ఎవరో చేసిన పనికి నేను బలయిపోయాను... ఆపని ఎవరు చేశారు." అడిగాను.

"మీకు ఎవరిమీదా అనుమానం కలగలేదా?"

"లేదు."

నేను వచ్చిన బులెట్‌ప్రూఫ్ కారు, ఎస్కార్టు కారు ఆవరణలోకి వచ్చి పోర్టికోకు దగ్గరగా నిలబడ్డాయి. కారులోంచి డ్రయివరు దిగి కారుకు ఆనుకుని నుంచున్నాడు.

చేతి గడియారం వంక చూసుకున్నాను. ఇనస్పెక్టరు నాకు పది అడుగుల దూరంలో నిలబడి ఉన్నాడు. వస్తున్నట్టు తలూపాను.

ఇదంతా గమనిస్తున్న విద్యావతి నేనెవరినో ఊహించడానికి ప్రయత్నిస్తూ ఉండొచ్చు. బయటపడదల్చుకోలేదు.

"మీతో చాలా విషయాలు మాట్లాడాలి. దయచేసి వెళ్ళకండి.. అన్నీ చెబుతాను.. " నా చేయి వదిలి స్టేజి వయిపు నడవబోతోంది. ఆమెను తిరిగి కలుస్తానో లేదో నాకు తెలియదు. ఆమె కుడి చేయి పట్టుకున్నాను. "ఆ పని ఎవరు చేశారు?" అడిగాను.

"రాధ... రాధ చేయించింది."

గుండె పగిలిపోయినట్టనిపించింది. నమ్మలేనట్టు తల అడ్డంగా ఆడించి, "ఎందుకు?" అడిగాను.

"మెహబూబ్‌ఖాన్‌ను పెళ్ళిచేసుకుందామని".

"చేసుకుందా?"

"అదో ఆ షామియానాలో బూడిదరంగు సూట్‌లో ఉన్న అతనే మెహబూబ్‌ఖాన్. నా భర్త..." ముడి వదులవుతోంది. విడిపోవాలి. విద్యావతి నా దగ్గరేదో దాస్తోంది. నిజం చెబుతున్నట్టు అనిపించడం లేదు. "మిమ్మల్ని కాలేజీ నుండి తీసేసిన మరుసటిరోజే గుప్పెడు నిద్రమాత్రలు మింగి ప్రాణం తీసుకుంది..." అంది.

ఆమె చేయి వదిలాను. కాలేజీ టవరు విరిగి నా మీద పడినట్టు అనిపించింది. విస్ఫోటనం తట్టుకోలేకపోతున్నాను. దుఃఖం తన్నుకొస్తోంది. అసలు నేను అక్కడకు రాకుండా ఉండాల్సింది. విద్యావతి చెప్పినవన్నీ అబద్ధాలయితే బావుణ్ణు. కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

నేను కూర్చున్న కారు ముఖద్వారం దాటుతున్నప్పుడు నేను బయటకు వెళ్తోన్న విషయం గమనించని విద్యావతి నా రాక గురించి మైక్‌లో ప్రకటిస్తూ, "డియర్ ఫ్రండ్స్! ఎప్పటినుంచో మనం ఎదురుచూస్తున్న దిగ్రేట్ రమాకాంత్ హేజ్ కమ్..." అంటోంది.

కారులో సీటుకు చేరగిలబడి, 'బట్... లెఫ్ట్ ఏజ్ ఎ డెడ్ మేన్' అనుకున్నాను.

* పాలపిట్ట, మాసపత్రిక ప్రత్యేక కథల సంచిక, 2011